# మంత్రి వేములకు మాతృ వియోగం



కుటుంబ సభ్యులతో మంజులమ్మ

కమ్మర్‌పల్లి/వేల్పూర్, అక్టోబర్ 12 : రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహ నిర్మాణ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృ మూర్తి వేముల మంజుల సురేందర్ రెడ్డి (77) హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. ఏడాది కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. గతంలో ఆమెకు బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ నిర్వహించారు. అప్పటి నుంచి కొన్ని రోజుల పాటు ఆరోగ్యం బాగుపడినా మళ్లీ కొన్ని నెలల నుంచి ఆరోగ్యం క్షీణించింది.అప్పటి నుంచి దవాఖానలోచికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. దీంతో మంత్రి వేముల కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. ఇటు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం ఉదయం వేల్పూర్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తారు. మంత్రి వేముల ఆయన సోదరుడు అజయ్ రెడ్డి, కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు, నాయకులు పరామర్శించారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేల్పూర్‌లో మంత్రి నివాసానికి చేరుకుని మంత్రిని ఓదారుస్తున్నారు. తల్లి మృతితో మంత్రి వేముల ఆవేదనతో రోదిస్తుంటే కార్యకర్తలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

**మంత్రికి పలువురి పరామర్శ**

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ మోహన్ రెడ్డి, శాసన సభా కార్యదర్శి నరసింహాచారి పలువురు మంత్రిని పరామర్శించారు.


**మాతృమూర్తి వియోగంతో బోరున విలపిస్తున్న మంత్రి**

వేముల మంజులమ్మ తల్లిగా, ఇల్లాలిగా మరుపురాని ఆత్మీయతను, ప్రేమను, బాధ్యతను తన భర్త వేముల సురేందర్‌రెడ్డి, కుమారులు వేముల ప్రశాంత్ రెడ్డి, అజయ్‌రెడ్డి, కూతురు రాధికారెడ్డికి అందించారు. అదే ప్రేమను ఆమె తన కుటుంబం అంతటికి చివరి కంట పంచారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఆయన సోదరుడు, సోదరి తల్లిచాటు బిడ్డలుగా ఎదిగారు మెదిలారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి తండ్రి సురేందర్ రెడ్డి దశాబ్దాల పాటు రైతు సేవలో, తొలి, మలిదశ ఉద్యమాల్లో, క్రియశీల నాయకత్వ రాజకీయాల్లో కొనసాగారు. భర్త రాజకీయ పయనం ఒకవైపు మరోవైపు చదువుల్లో ఉన్న పిల్లలు. ఇలాంటి ఇబ్బందుల్లో సైతం మంజులమ్మ తన భర్త రాజకీయ పయనాన్ని ప్రోత్సహించారు. మరోవైపు పిల్లల చదువు పట్ల ఆమె శ్రద్ధ చూపించారు. పెద్ద కొడుకు ప్రశాంత్ రెడ్డి సివిల్ ఇంజినీరింగ్ చదవడంలో, చిన్న కొడుకు అజయ్ రెడ్డి, కూతురు రాధికా రెడ్డి ప్రభుత్వోద్యోగులు కావడంలో తల్లిగా తన బాధ్యతను నెరవేర్చారు.

## నేడు వేల్పూర్‌కు సీఎం కేసీఆర్

నిజామాబాద్, అక్టోబర్ 12 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి వేముల మంజులమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ శుక్రవారం వేల్పూర్‌కు రానున్నారు. మంజులమ్మ అంత్యక్రియలు శుక్రవారం ఉదయం వేల్పూర్‌లో జరుగనున్నాయి. కేసీఆర్ ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో వేల్పూర్‌కు వచ్చి అంత్యక్రియల్లో పాల్గొని మంత్రి వేముల, కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సీఎం కేసీఆర్ పర్యటన ఖరారు కావడంతో పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అంత్యక్రియలకు హాజరయ్యే అవకాశమున్నది. మంజులమ్మ మృతిపై సీఎం కేసీఆర్ ఇది వరకే సంతాపం వ్యక్తం చేసి మంత్రి ప్రశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ప్రముఖుల సంతాపం



తల్లి పార్థివదేహం వద్ద రోదిస్తున్న మంత్రి వేముల

బాన్సువాడ/ డిచ్‌పల్లి/ ఖలీల్‌వాడి, అక్టోబర్ 12 : రాష్ట్ర మంత్రి వేముల మాతృమూర్తి వేముల మంజులమ్మ మృతికి స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మంజులమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ , మంత్రి ప్రశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ మరణంపై రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సంతాపం ప్రకటించారు. ప్రశాంత్‌రెడ్డికి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని మంజులమ్మ ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. మంజులమ్మ మరణంపై నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సంతాపం ప్రకటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పోచంపాడ్ ఏటీఎం చోరీ.. హర్యానా ముఠా పనే

- ఒకరి అరెస్టు.. పరారీలో మరో ఐదుగురు నిందితులు
- లారీ స్వాధీనం
- వివరాలను వెల్లడించిన డిప్యూటీ పోలీస్ కమిషనర్ జయరాం




వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ పోలీస్ కమిషనర్ జయరాం

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 12 : మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచంపాడ్‌లో 15 రోజుల క్రితం ఏటీఎంను కొల్లగొట్టిన ముఠాకు చెందిన ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ జయరాం వివరాలను వెల్లడించారు. హర్యానా రాష్ట్రంలోని నవాబ్ గడ్ గ్రామానికి చెందిన జన్నెయిల్, అఫ్జల్, సాజీద్, సామార్, హనీఫ్, హనీఫ్ ఆరుగురు ఓ ముఠాగా ఏర్పాడ్డారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలని పథకం రచించారు. ముఠా సభ్యులు లారీలో ఆపిల్స్ లోడ్ నింపుకొని వాటితో పాటు ఒక గ్యాస్ కట్టర్, స్ప్రే బాటిల్, గ్యాస్ సిలిండర్ సైతం వేసుకున్నారు. ఆపిల్ లోడ్‌ను నిజామాబాద్‌లో ఖాళీ చేసిన అనంతరం ఈ గ్యాంగ్ లారీలో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌ను చోరీ చేశారు. అనంతరం కారును దొంగిలించి కారులో గ్యాస్ కట్టర్, సిలిండర్,స్ప్రే బాటిల్ వేసుకొని నిర్మల్ జిల్లా వైపు బయలుదేరారు. గత 27వ తేదీన మెండోరా మండలం పోచంపాడ్ ఎక్స్ రోడ్డు పరిధిలోని దూదిగాం వద్ద ఎస్‌బీఐ ఏటీఎంను చూసిన దుండగులు లూటీ చేసేందుకు అక్కడ వాహనాలు నిలిపారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి, రూ.12లక్షల 46 వేల 500 నగదును దోచుకొని పరారయ్యారు. ఈ సంఘటనపై ఎస్‌బీఐ పోచంపాడ్ బ్యాంక్ మేనేజర్ బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెండోరా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ముఠా కోసం అన్వేషణ ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలో నింధితుడు జన్నెయిల్‌ను లారీతో పాటు అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగతా ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని వారి త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. కేసును ఛేదిచడంలో ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్, సీసీఎస్ సీఐ రమేశ్, మెండోరా ఎస్సై శ్రీనివాస్, బాల్కొండ ఎస్సై గోపి, ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి, ఐటీ సెల్ ఆర్ఎస్సై నిషిత్, సీసీఎస్ ఏఎస్సై నాగభూషణం, వేల్పూర్ హెచ్‌సీ మల్లేశ్, కైలాస పతి, సీసీఎస్ హెచ్‌సీ గిరి, డిచ్‌పల్లి, ముప్కాల్, మెం డోరా కానిస్టేబుళ్లు రాజేశ్వర్, గోపి, గంగయ్య, చరణ్, సుభాష్, వెంకట్రాం, రాజేంద్ర ప్రసాద్, సాగర్, సందీ ప్, హోంగార్డులు రాకేశ్, మెహన్ రెడ్డి, ఓం ప్రకాశ్ కృషి చేశారని.. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## మనస్తాపంతో గొంతుకోసుకొని యువకుడి ఆత్మహత్య



వెంకట్ (ఫైల్)

నిజామాబాద్,క్రైం;అక్టోబర్ 12 : నగరంలోని ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన రాపల్లి వెంకట్(35)అనే యువకుడు మనస్తాపంతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. సంబంధిత త్రీ టౌన్ ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకట్‌కు మూడేండ్ల క్రితం వినాయక నగర్‌కు చెందిన ఉషా అనే యువతితో వివాహం జరిగింది. దంపతుల మధ్య చిన్నపాటి విభేదాలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీనికి తోడు ఆరు నెలల క్రితం తల్లి మరణించడంతో తీవ్రమనస్తాపం చెందిన వెంకట్ బుధవారం రాత్రి ఇంట్లో కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాని పరిశీలించిన ఎస్సై పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కుటుంబ సభ్యులే ముఠాగా ఏర్పడి..

- రెండు ఏటీఎంల చోరీలకు విఫలయత్నం
- నలుగురు పాత నేరస్తుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 12 : భీమ్‌గల్, వేల్పూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు ఏటీఎం సెంటర్లలో చోరీకి విఫలయత్నం చేసిన నలుగురు పాత నేరస్తులను గురువారం అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి సీపీ జయరాం వెల్లడించారు. కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జక్రాన్‌పల్లికి చెందిన అల్లెపు స్వామి, అల్లెపు దేవేందర్, అల్లెపు శైలజ, ఆర్మూర్ ఒడ్డెర కాలనీకి చెందిన నర్ర నవీన్ ఒకే కుటుంబానికి చెందిన వీరంతా చోరీలు చేయడమే వృత్తిగా పెట్టుకున్నారు. ఈ నెల 8వ తేదీన అర్ధ రాత్రి బడాభీమ్‌గల్‌లో చోరీ చేసిన బైక్‌పై వచ్చిన ముగ్గురు ఏటీఎం లూటీకి విఫలయత్నం చేశారు. 9వ తేదీ వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో ఏటీఎం చోరీకి యత్నించారు. దొంగిలించిన ట్రాక్టర్‌లో ఏటీఎం మిషన్‌ను ఎక్కించి పారిపోయేందుకు యత్నించగా స్థానికులు చూసి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. వీరు ఇప్పటికే పలు దొంగతనాల్లో జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటి వరకు దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు గురువారం వచ్చిన అల్లెపు శైలజతో పాటు మిగతా ముగ్గురిని ముచ్కూర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఒక బైక్‌తో పాటు 12 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి సీపీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ఆర్మూర్ ఏసీపీ ఆర్.జగదీశ్ చందర్, భీమ్‌గల్ సీఐ ఏ.వెంకటేశ్వర్లు, ఎస్సై ఏ.హరిబాబు, కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్‌తో పాటు సీసీఎస్ ఏసీపీ విజయ సారథి, సీఐ రమేశ్, సిబ్బంది రాజశేఖర్, రంజిత్, తిరుమలేశ్, రఘువీర్, సుధీర్, మనోజ్, రాజ, సంపత్, గంగాప్రసాద్‌లను అభినందించి, రివార్డులు అందజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★టెంపరరీగా 12 రోజులు (అక్టోబర్ 22వ తేది వరకు) పనిచేయుటకు డిగ్రీ స్టూడెంట్స్ కావలెను. సమయం:10AM to 10 PM/1 PM to 10 PM (Daily: 400/500) ఆసక్తి గలవారు. ID ప్రూఫ్, ఫోటో, డిగ్రీ సర్టిఫికేట్‌తో నేరుగా సంప్రదించగలరు. అనఘా షాపింగ్‌మాల్. ఆర్.పి.రోడ్, నిజామాబాద్
NTZ-321178

PLOT FOR SALE
★హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers. Ph: 9666912111, 7995005999.
NT-320501

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

WANTED
Telemarketing Representative
Company: Med Axis Abroad Educational Service Salary 10000/- to 15000/-, Bonuses Based on lead turn overs Call/ Message ur Resume
91828 89004

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.